

# శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరు వార్త

## సర్వాయపాలెం కళుగోళశాంభవి ఆలయ అభివృద్ధికి 5లక్షలు

### కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటకృష్ణారెడ్డి





**కావలి, జనవరి16 ప్రభాతవార్త** కావలి రూరల్ మండలం సర్వాయపాలెం గ్రామంలో వెలసిఉన్న కళుగోళ శాంభవి అమ్మవారి ఆలయ అభివృద్ధికి 5 లక్షల రూపాయలు అందచేస్తానని కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటకృష్ణారెడ్డి తెలిపారు. అమ్మవారి తిరునాళ్ల కార్యక్రమంలో ఎమ్మెల్యే దగుమాటి ముఖ్యఅతిధిగా పాల్గొన్నారు. గ్రామస్తులు, ఆలయ కమిటి సభ్యులు ఎమ్మెల్యేకు ఘనస్వాగతం పలికారు. దారిపొడుగునా పూలవర్షం కురిపించారు. భారీఎత్తున బాణాసంచా పేల్చి అభిమానాన్ని చాటిచెప్పారు. అమ్మవారిని ఎమ్మెల్యే దగుమాటి దర్శించుకుని ప్రత్యేకపూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ఈ విరాళాన్ని ప్రకటించారు. ఈ గ్రామంలో సిసిరోడ్లు, ఇతర అన్ని సౌకర్యాలు కల్పిస్తానని గ్రామస్తులకు హామీ ఇచ్చారు. ఎమ్మెల్యే వెంట టిడిపి నేతలు పాల్గొన్నారు.

## బహుమతులు ప్రధానం చేసిన వీపీఆర్ఆర్



**నెల్లూరు, జనవరి 16, ప్రభాతవార్త-వైద్యం** సంక్రాంతి పండుగ సందర్భంగా గురువారం 53,54వ డివిజన్ల తెలుగుదేశం పార్టీ, జనసేన పార్టీల ఆధ్వర్యంలో నగర నియోజకవర్గంలోని వెంకటేశ్వరపురంలో, నెల్లూరు మున్సిపల్ కార్పొరేషన్ కోఆప్షన్ మెంబర్ జమీర్, 53,54వ డివిజన్‌ల క్లష్టర్ ఇన్‌ఛార్జీ జహీర్, జనసేన పార్టీ జిల్లా మహిలా నాయకురాలు ఆలియా ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిధులుగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పౌరసరఫరాల సంస్థ డైరక్టర్ వేమిరెడ్డి పట్టాభిరామిరెడ్డి, జనసేన పార్టీ నగర అధ్యక్షులు సుజయ్ బాబులు విచ్చేశారు. ముగ్గుల పోటీలలో గెలిచిన ప్రధమ బహుమతి, ద్వితీయ, తృతీయ, నాలుగు స్థానం వాళ్లకి వేమిరెడ్డి పట్టాభిరామిరెడ్డి, సుజయ్‌బాబు చేతుల మీదుగా బహుమతులు అందించడం జరిగింది. ఈ పోటీల్లో సుమారుగా 100 మంది ముగ్గుల పోటీలో పాల్గొనడం జరిగింది. పాల్గొన్న ప్రతి ఒక్కరికి బహుమతులు అందించడం జరిగింది.

## కోడిపందాలు, పేకాట నిర్వహిస్తే చర్యలు- ఎస్సై కాంతికుమార్



**సైదాపురం, జనవరి 16, ప్రభాతవార్త** సైదాపురం మండలంలో ఎవరైనా కోడిపందాలు, పేకాట నిర్వహిస్తే వారిపై చర్యలు తీసుకోవడం జరుగుతుందని సైదాపురం ఎస్సై కాంతికుమార్ హెచ్చరించారు. మండలంలోని అనంతమడుగు, కొమ్మిపాడు గ్రామాల్లో కోడిపందాలు నిర్వహిస్తున్న స్థావరాలపై గురువారం పోలీసులు దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ అనంతమడుగు, కొమ్మిపాడు గ్రామాల సమీపంలో కోడిపందాలు నిర్వహిస్తున్నారని సమాచారం రావడంతో వెంటనే సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించడం జరిగిందని ఆయన తెలిపారు. ఈ దాడుల్లో అనంతమడుగులో ఐదు మందిని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుండి ఒక పందెం కోడిని, రూ.4600 నగదును స్వాధీనం చేసుకోవడం జరిగిందని ఆయన తెలిపారు. అలాగే కొమ్మిపాడులో ఇద్దరిని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుండి రెండు కోళ్ళు, రూ.1600 నగదు స్వాధీనం చేసుకున్నామని ఎస్సై తెలిపారు. మండలంలో ఎవరైనా పేకాట, కోడిపందాలు నిర్వహిస్తే చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు. దాడుల్లో రైటర్ నరేష్ తదితరులు పాల్గొన్నారు.

## మూడో రాకెట్ కేంద్ర స్థాపనకు రూ.3,984 కోట్లు

### 2040 నాటికి చంద్రుడిపై భారత వ్యోమగాములు



**నెల్లూరు, జనవరి 16, ప్రభాతవార్త -వైద్యం** శ్రీహరికోటలో మూడో రాకెట్ ప్రయోగ కేంద్రం ఏర్పాటుకు కేంద్ర మంత్రి వర్గం ఆమోదం తెలపడంతో భారతీయ జనతా పార్టీ జిల్లా కార్యదర్శి చిలకా ప్రవీణ్ కుమార్ హర్షం వ్యక్తం చేశారు. గురువారం నగరంలోని బీజేపీ జిల్లా కేద్ర కార్యాలయంలో ప్రవీణ్ కుమార్ విలేకర్లతో మాట్లాడుతూ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో భారత అంతరిక్ష రంగం అత్యున్నత స్థాయికి చేరుకుంటుంది అనడంలో ఎంత మాత్రం అతిశయోక్తి లేదు. మూడో రాకెట్ ప్రయోగ కేంద్రం ఏర్పాటుతో, భారత్ అంతరిక్షం రంగంలో మరింత శక్తిని పొందనుందని ఆయన తెలియజేశారు ఇది దేశానికి గర్వకారణమని ప్రధాని నరేంద్ర మోడీని కొనియాడారు. మానవ సహిత అంతరిక్ష మిషన్ల సామర్థ్యాన్ని పెంచడంలో ఈ కేంద్రం కీలకంగా మారుతుందని ఆయన ఉద్ఘాటించారు. మూడో రాకెట్ ప్రయోగ కేంద్రం ఏర్పాటుకు రూ.3984.86 కోట్ల వ్యయంతో మౌలిక సదుపాయాల అభివృద్ధి చేపట్టడంపై కేంద్ర ప్రభుత్వానికి ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ ప్రాజెక్ట్ ద్వారా భారత్ అంతరిక్ష రంగంలో మరిన్ని విజయాలు సాధించి, ప్రపంచ స్థాయి శక్తిగా ఎదగనుందన్నారు. 2035 నాటికి భారతీయ అంతరిక్ష కేంద్రం స్థాపన, 20240 నాటికి చంద్రుడిపై భారత వ్యోమగాముల బృందం దిగిపడే లక్ష్యాలను సాధించేందుకు ఈ నిర్ణయం కీలకంగా మారుతుందని చిలకా ప్రవీణ్ కుమార్ విశ్వాసం వ్యక్తం చేశారు. భవిష్యత్తులో భారత అంతరిక్ష రంగం మరిన్ని విజయాలను సాధించి ప్రపపంచంలోని అగ్రగామిగా నిలుస్తుందని ప్రవీణ్ ఆశాభావం వ్యక్తం చేశారు.

## కండలేరులో 55.952 టీయంసీల నిటిమట్టం



**కండలేరుడ్యాం (రాపూరు), జనవరి 16 ప్రభాతవార్త** మండలంలోని కండలేరు జళాశయంలో గురువారం ఉదయానికి 55,952 టీయంసీల నిటిమట్టం నమొదు అయినట్లు కండలేరు ఇంజనీరింగ్ అధికారులు తెలిపారు. ఇందులో సోమశిల.కండలేరు వరద కాలువ ద్వారా 180 క్యూసెక్కులు ఇన్‌ఫ్లోగా జళాశయంలోకి వస్తుండగా అవుట్‌ఫ్లోగా జళాశయం హెడ్ రెగ్యులేటర్ నుండి 975 క్యూసెక్కులు,1వ బ్రాంచి కెనాల్ ద్వారా 70 క్యూసెక్కులు,లో లెవల్ స్లూయిస్ ద్వారా 10 క్యూసెక్కులు, హైలెవల్ కెనాల్ ద్వారా 110 క్యూసెక్కుల చోప్పున మొత్తం 1095 క్యూసెక్కుల నీరు అవుట్ ఫ్లోగా వెలుతున్నట్లు ఇంజనీరింగ్ అధికారులు తెలిపారు.

## రాష్ట్రంలో టౌన్ ప్లానింగ్ విభాగంలో నూతన సంస్కరణలను తీసుకొచ్చాం

- బిల్డింగ్ అనుమతులను సరళతరం చేశాం
- రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి





**నెల్లూరు కార్పొరేషన్,జనవరి 16, ప్రభాతవార్త:** దేశంలో ఎక్కడా లేనివిధంగా పట్టణాభివృద్ధి, టౌన్ ప్లానింగ్ విభాగాల్లో నూతన సంస్కరణలను రాష్ట్రంలో అమలు చేస్తున్నామని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పొంగూరు నారాయణ తెలిపారు.గురువారం నెల్లూరు నగరపాలక సంస్థ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ ఆనంద్, ఎస్పీ కృష్ణ కాంత్, మున్సిపల్ కమిషనర్ సూర్య తేజ, నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులు రెడ్డి, జిల్లా రిజిస్ట్రార్ బాలాంజనేయులు తదితరులతో కలిసి సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా మంత్రి నారాయణ మాట్లాడుతూ వివిధ రాష్ట్రాల్లో టౌన్ ప్లానింగ్ విభాగాల్లో అనుసరిస్తున్న పద్ధతులను పరిశీలించి రాష్ట్రంలో సంస్కరణలను చేపట్టామన్నారు. దాదాపు 18 అంశాలలో మార్పులు చేసి ప్రజలకు అనుకూలంగా సులభతరం చేశామన్నారు.ఇంటి నిర్మాణదారులు, అలాగే లేఅవుట్ నిర్వాహకులు అత్యంత సులువుగా మున్సిపల్ అనుమతులు పొందేలా తయారుచేసామన్నారు. ఈ పద్ధతి వల్ల రియల్టర్లు, బిల్డర్లు, అపార్ట్మెంట్ నిర్మాణదారులు హర్షం వ్యక్తం చేశారన్నారు. అదేవిధంగా నెల్లూరు నగరపాలక సంస్థలో వివిధ రకాల అనుమతుల కోసం పెండింగ్ లో ఉన్న 11 మంది దరఖాస్తుదారులను సమావేశానికి పిలిపించి పరిష్కరించే ప్రయత్నం చేశారు. వాటిలో ఏడు దరఖాస్తులను రెండు రోజుల్లోగా పరిష్కరించే విధంగా అధికారులకు సూచనలు జారీ చేశారు.కొన్ని అంశాలకు సంబంధించి విజయవాడలోని పురపాలక శాఖ సెక్రటరీ, టౌన్ ప్లానింగ్ డైరెక్టర్ల తో నేరుగా ఫోన్ ద్వారా మాట్లాడి అనుమానాలను నివృత్తి చేయించారు. మున్సిపల్ పట్టణాభివృద్ధి శాఖలో తీసుకువచ్చిన సంస్కరణలను అమలు చేసే దశలో నెల్లూరు నగరపాలక సంస్థ ముందుండాలని అధికారులను ఆదేశించారు. అనధికార లేఅవుట్లలో ప్రత్యేక బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. ఎవరి మీద ఎటువంటి కక్ష సాధించాలని ఉద్దేశం తమకు లేదన్నారు. అలాగే లేఔట్ యజమానులు, వ్యాపారులు అన్ని అనుమతులు తీసుకుంటే, పన్నులు జీఎస్టీ తదితరాల ద్వారా ప్రభుత్వానికి ఆదాయం సమకూరుతుందని వివరించారు. ఈ సమావేశంలో ఆర్డిఓ అనూష , టౌన్ ప్లానింగ్ అధికారి హిమబిందు, డీసీపీ పద్మజ, ఇతర అధికారులు పాల్గొన్నారు

## ఏటి పండుగ ఏర్పాట్లు భేష్

- ఆనవాయితీగా గొబ్బెమ్మల నిమజ్జనం
- వాహన పార్కింగ్‌కు స్థలం కేటాయించండి
- గజ ఈతగాళ్లను సిద్ధం చేయండి
- అధికారులను ఆదేశించిన నారాయణ



**నెల్లూరు, జనవరి 16, ప్రభాతవార్త-వైద్యం** పెన్నా అనేది ఒడ్డున నిర్వహించనున్న ఏటి పండుగగా ఏర్పాట్లను గురువారం ఉదయం పరిశీలించి, ఏర్పాటు బేషుక్గ్గా ఉన్నాయని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పొంగూరు నారాయణ అన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ పెద్ద పండుగల అనంతరం గొబ్బెమ్మల నిమజ్జ నోత్సవం ఆనవాయితీగా వస్తున్న ఆచారమన్నారు. ఏటి పండుగను ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తుందని తెలిపారు. నేటి సాయంత్రం జరిగే గొబ్బెమ్మ నిమజ్జనోత్సవం పండుగలో నెల్లూరు నుండే కాకుండా చుట్టు పక్కల గ్రామాల నుండి లక్షలాదిగా భక్తులు పాల్గొనే అవకాశం ఉన్నందున ముందు జాగ్రత్త చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించండం జరిగిందన్నారు. ముఖ్యంగా పెన్నా నదిలో అవసరాన్ని బట్టి నీటిని విడుదల చేయాలని ఆదేశించామన్నారు. నీఇలో చెత్తా చెదారాలు తొలగించి శుభ్రపరచాలని, గజ ఈతగాళ్లను సిద్ధం చేయాలని, ఇక్కడ భక్తులు కూర్చుని తినుబండారాలు, భోజనాలు చేసేందుకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని ఆదేశించామన్నారు. ఈ ప్రాంతంలోనే జిల్లాలోని తొమ్మిది దేవాలయాల దేవతమూర్తునలు ఏర్పాటు చేస్తారని, ఏటి పండుగకు వచ్చే భక్తులు ఆయా దేవతమూర్తులను దర్శించుకునేందుకు తగిన విధంగా బారికేడ్లను నిర్మించాలని సూచించారు. అలాగే పెన్నా బ్యారేజీ పక్కన వాహనాల పార్కింగ్‌కి అవసరమైన స్థలాన్ని కేటాయించాలని పోలీసుశాఖ అధికారులకు సూచించామన్నారు. సాంస్కృతిక కార్యక్రమాల వేదికను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఇరిగేషన్ మున్సిపల్ పోలీసు తదితర శాఖల సమన్వయంతో ఏర్పాట్లు చక్కగా చేశారని మంత్రి ప్రత్యేకంగా అభినందించారు. నిన్న నవాబుపేటలో కనుమ పండుగ సందర్భంగా జరిగిన పార్వేట తెప్పోత్సవానికి లక్షలాది మంది భక్తులు విచ్చేశారని, గతంలో తాను మంత్రిగా ఉన్న సమయంలో బురద మయంగా ఉన్న కాలువకు అప్పటి మేయర్ అబ్దుల్ అజీజ్ సహకారంతో ఘాట్లను నిర్మించి సుందరంగా తీర్చిదిద్దామని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో ఆయనతో పాటు తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు, నారాయణ విద్యా సంస్థల జనరల్ మేనేజర్ వేమిరెడ్డి విజయభాస్కర్‌రెడ్డి, స్థానిక కార్పొరేటర్లు, నాయకులు, వివిధ శాఖల అధికారులు ఉన్నారు.

## సబ్సిడీ రుణాల ధరఖాస్తు కోసం అగచాట్లు

### గడువు దాటిపోయినా ఓపెన్ కాని ఓబిఎంఎంఎస్ పోర్టల్

**వలేటివారిపాలెం జనవరి 16, ప్రభాతవార్త** బీసీ కార్పోరేషన్ రుణాల ధరఖాస్తు విషయంలో విచిత్ర పరిస్థితి నెలకొంది. దరఖాస్తుకు గడువు ముగిసినా సంబందిత పోర్టల్ ఓపెన్ కాకపోవడం పలు విమర్శలకు తావిస్తోంది.దరఖాస్తుకు ఆశావహులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పలు అగచాట్లు పడుతున్నారు. నెట్, సచివాలయాల చుట్టూతిరుగు తున్నారు. గురువారం ధరఖాస్తుకు చివరితేదీ అయినా కనీసం ధరఖాస్తు పోర్టల్ ఓపెన్ కాకపోవ డం ఏమిటని పలువురు ప్రశ్నిస్తున్నా రు. ఈ మేరకు ఎంపీడీవో కార్యాలయానికి పోన్ చేస్తున్నారు.

**వివరాల్లోకి వెళితే..** ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈబీసీ, కాపు, బలిజ, ఒంటరి కులాలకు చెంది దారిద్ర్య రేఖకు దిగువన గల పలువురు లబ్దిదారులజీవనోపాధి మెరుగుపరచడం, నూతన యూనిట్లు స్థాపించు నిమిత్తం 2024-25 ఏడాదికిగాను ప్రభుత్వం రాయితీతోకూడిన రుణాలను అందించాల ని ఈ నెల 8న జిల్లాకేంద్రంలో జరిగిన డీసీపీ ప్రత్యేకసమావేశంలో నిర్ణయించింది.ఈ మేరకు బీసీ కార్పోరేషన్‌తో పాటు ఈబీసీ, కమ్మ, రెడ్డి, ఆర్యవైశ్య క్షత్రియ,బ్రాహ్మణ, కాపు కార్పోరేషన్‌ల ద్వారా ఒక్కొ క్కరికి రూ.5లక్షల లోపు రుణాలను 50శాతంతో రాయితీతో అందించాలని నిర్ణయించారు.ఈ మేరకు జిల్లావ్యాప్తంగా సుమారు 2వేల మందికి దాదాపు రూ.4కోట్ల మేర రుణాలను మంజూరు చేయుటకు అవసరమైన షెడ్యూల్‌ను విడుదల చేశారు.ఆసక్తి అర్హత గల వారి నుంచి ఆన్‌లైన్‌లో ధరఖాస్తులను ఈ నెల 8వ తేదీ నుంచి 16వ తేదీ వరకు స్వీకరిం చాలని ముందస్తు సమాచారం అందించారు. ఇందు కోసం ఆధార్,రేషన్‌కార్డులు, ఆదాయం,కులం సర్టిపికె ట్‌లు పాస్ పోర్టుసైజు పోటోతో ఏపీఓబిఎంఎంఎస్ పోర్టల్‌లో ధరఖాస్తుచేయాలని సూచించారు.దీంతో ఇందుకోసం పలువురు సచివాలయాలు, నెట్‌సెంటర్‌ల చుట్టూతిరుగుతున్నా రు.అయితే ఏపీఓబిఎంఎంఎస్ పోర్టల్ ఓపెన్ కావడం లేదని, లింక్‌డ్ మెబైల్‌పోన్‌కి ఓటీపీలు రావడంలేదని దర ఖాస్తుదారులు వాపోతున్నారు.ఈ నెల16న అనగా గురువారం ధరఖాస్తుచివరి రోజైనా సంబందిత పోర్ట ల్ ఓపెన్ కాకపోవడం ఏమిటని పలువురు లబ్దిదారు లు ఆవేదన చెందుతున్నారు.ఈ విషయమై ఎంపీడీ వో నరేంద్రదేవ్ మాట్లాడుతూ ధరఖాస్తు విషయంలో సాంకేతికలోపం కారణం తలెత్తిందన్నారు. త్వరలో సమస్యకు పరిషా ్కరం దొరుతుందన్నారు.

## సౌర విద్యుత్‌కి బ్యాంకు రుణాలు



**నెల్లూరు, జనవరి 16, ప్రభాతవార్త-వైద్యం** ప్రధానమంత్రి సూర్యఘర్ ముప్తి యోజన బిజిలీ పథకానికి బ్యాంకు నుంచి రుణాలు పొందవచ్చని విద్యుత్ శాఖ నెల్లూరు జిల్లా సూపరింటెండెంట్ వి.విజయన్ తెలిపారు. గురువారం విద్యుత్ భవన్‌లోని తన ఛాంబర్‌లో విజయన్ నెల్లూరు జిల్లా టౌన్, రూరల్ డివిజన్ అధికారులతో సూర్యఘర్ పై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పునరుత్పాదక ఇంధన వినియోగం, ఉత్పత్తిపై ఎక్కువగా దృష్టి సారించాయి. అందులో భాగంగా ప్రధానమంత్రి సూర్యఘర్ ముప్తి బిజిలీ యోజన పథకాన్ని అమలు చేస్తున్నాయి. ఇండ్ల పై కప్పుల(రూఫ్ టాప్) రోప్ పై సౌర పలకలు ఏర్పాటు చేసుకొని ఇంటి అవసరాలకు తగ్గ విద్యుత్‌ను ఉత్పత్తి చేసుకునేలా ప్రోత్సహిస్తున్నాయి. దీని కోసం కిలోవాట్ల వారీగా రాయితీ ఇస్తున్నాయి. బ్యాంకు రుణ సదుపాయాలను అందిస్తున్నాయి. ఎస్సీ, ఎస్టీ కుటుంబాలకు సౌర వెలుగులను అందించేందుకు ప్రభుత్వం సన్నాహాలు చేస్తుందని తెలిపారు. పీఎం సూర్యఘర్ పథకం కింద రెండు కిలోవాట్ల రూఫ్ టాఫ్ సౌర విద్యుత్ ప్రాజెక్టులను ఉచితంగా అందివ్వనుంది. ఈ ప్రాజెక్ట కింద కేంద్రం 60 శాతం, రాష్ట్ర ప్రభుత్వం 40 శాతం ఖర్చు భరించనున్నాయి. ప్రస్తుతం ఎస్సీ, ఎస్టీలకు ప్రతి నెల 200 యూనిట్ల వరకు ప్రభుత్వం ఉచిత విద్యుత్ అందజేస్తుంది. స్మార్ట్ మీటర్లను కూడా ప్రభుత్వమే సమకూరుస్తుందని, లబ్దిదారులపై ఎలాంటి ఆర్థిక భారం పడకుండా చూడాలన్నదే ప్రభుత్వ లక్ష్యమన్నారు. సౌర యూనిట్ల ద్వారా ఉత్పత్తి అయ్యే విద్యుత్తులో మిగులును నెట్ మీటరింగ్ ద్వారా గ్రిడ్‌కు అనుసంధానిస్తారని చెప్పారు. ప్రస్తుతం లబ్దిదారులను గుర్తించే పనిలో అధికారులు ఉన్నారని, ఇంటింటికి తిరిగి పేర్లు నమోదు చేస్తున్నారని తెలియజేశారు. దీనికి సంబంధిత సర్వీస్ కనెక్షన్ నెంబర్, మొబైల్ నెంబరు, యాప్‌లో నమోదు చేయగానే 6 నెంబర్ల ఓటీపీ వస్తుంది ఇది నమోదు చేయగానే రిజిస్ట్రేషన్ పూర్తవుతుంది. జిల్లా పరిధిలో ఎస్సీ, ఎస్టీ కనెక్షన్ వివరాలను అధికారులు సేకరించి ప్రభుత్వానికి పంపించనున్నారు. దీని ఆధారంగా ప్రభుత్వం టెండర్లు పిలవనుందని, విద్యుత్ ఛార్జీల భారం తగ్గించుకోవడానికి రూఫ్‌టాప్ సోలార్ మంచి మార్గం, బిల్లులు రీడింగ్ తీసే సమయంలో ఇంటింటా అవగాహన కల్పిస్తున్నామని వివరించాఉ. కలెక్టర్ సూచనలతో విస్తృతంగా ప్రచారం చేస్తున్నామని ఆయన వెల్లడించారు. హెల్తీ, వెల్తీ, హ్యాపీ స్వర్ణాంధ్రప్రదేశ్ లక్ష్యంలో భాగంగా సోలార్ విద్యుత్ వ్యవస్థ వైపు అందరూ అడుగులు వేయాలన్నదే మన ముఖ్యమంత్రి ఆశయం అని ఆ విధంగా మనం అడుగులేస్తే విజన్-2047 లో భాగస్వాములు అవుతానని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎగ్జిక్యూటీవ్ ఇంజనీర్ టౌన్ ఎం.శ్రీధర్, ఎగ్జిక్యూటీవ్ ఇంజనీర్ రూరల్ సోమశేఖర్ రెడ్డి, ఎగ్జిక్యూటీవ్ ఇంజనీర్ కనస్ట్రక్షన్ పరందామయ్య, ఎగ్జిక్యూటీవ్ ఇంజనీర్ ట్రాన్స్ ఫార్మర్స్ లక్ష్మీ నారాయణ, డిప్యూటీ ఎగ్జిక్యూటీవ్ ఇంజనీర్స్ అశోక్, సునీల్, కిరణ్, భాను నాయక్, రాము, మునీంద్ర, టౌన్, రూరల్ డివిజన్ అసిస్టెంట్ ఇంజనీర్ల, సోలార్ వెండర్స్ పాల్గొన్నారు.

## ప్రజావేదిక బహిరంగ సభ నేడే



**వింజమూరు, జనవరి16,ప్రభాతవార్త**:వింజమూరులోని మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం జాతీయ గ్రామీణ ఉపాదిహామీ పథకం ప్రజావేదిక బహిరంగ సభ నిర్వహంచబడుతుందని ఎంపిడిఒ శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఇప్పటివరకు మండలంలో అన్ని పంచాయతీల్లో జరిగిన జాతీయ గ్రామీణ ఉపాది హామీ పనుల ఎస్ఆర్పిలు ప్రత్యక్ష పరిశీలన చేసి నివేదికలను తయారు చేశారని ఆ నివేదికల ఆధారంగా పంచాతీల వారీగా చర్చిస్తారన్నారు. కావున అన్ని పంచాయతీలకు చెందిన జాతీయ గ్రామీణ ఉపాది హామీ సిబ్బంది అధికారులు ఆయా గ్రామస్తులు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

## బత్తినవారిపల్లిలో వైద్యశిబిరం

వింజమూరు, జనవరి16,ప్రభాతవార్త:మండలంలోని చాకలికొండ ఆరోగ్యకేంద్రంలో ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. గతంలో గ్రామ ప్రజలు సీజనల్ జ్వరాలకు గురవుతున్నారనే ఫిర్యాదు మేరకు గురువారం మెడికల్ క్యాంప్ ఏర్పాటు చేశామని వైద్యాధికారి డాక్టర్ మురళీధర్ తెలిపారు. ఈసందర్భంగా ఆయన గ్రామంలో పర్యటించి పారిశుధ్యం పరిస్థితులను పరిశీలించారు. ఎక్కడా మురుగునీరు లేకుండా చూడాలని, దోమల నివారణఖు చర్యలు చేపట్టాలని, ప్రజలకు సురక్షితమైన తాగునీటిని అందించాలని పంచాయతీ సిబ్బందికి సూచించారు. వైద్య ఆరోగ్య సిబ్బంది ప్రతి ఇంటికి వెళ్ళి జ్వరాల పరిస్థితిని కనుక్కోవాలని సూచించారు. పరిసరాల పరిశుభ్రతపై ముందస్తు జాగ్రత్తల గురించి ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఈకార్యక్రమంలో పంచాయతీ, వైద్య ఆరోగ్య సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

## బిట్రగుంట పూర్వ వైభవానికి కృషి చేస్తాను



బిట్రగుంట జనవరి 16 ప్రభాతవార్త: బిట్రగుంట పూర్వ వైభవానికి కృషి చేస్తానని కావలి శాసనసభ్యులు దగుమాటి వెంకట క్రిష్ణారెడ్డి తెలిపారు. బోగోలు మండలం విశ్వనాదరావు పేటలో యంగ్ లయన్స్ ఆధ్వర్యంలో సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కావలి శాసనసభ్యులు దగుమాటి వెంకట క్రిష్ణారెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఎమ్మెల్యే కు యంగ్ లైన్స్ సభ్యులు ఘన స్వాగతం పలికారు. వివిధ పోటీల్లో గెలుపొందిన విజేతలకు ఎమ్మెల్యే బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎక్కడో ఉద్యోగాలు చేస్తూ జన్మభూమిని గుర్తు పెట్టుకొని పండుగ సందర్భంగా ఇక్కడకు విచ్చేస్తూ, సంబరాలు నిర్వహిస్తున్న యంగ్ లైన్స్ సభ్యులకు అభినందనలు తెలిపారు. బోగోలు లో ప్రభుత్వ హాస్పిటల్, కేంద్రీయ విశ్వ విద్యాలయం ఏర్పాటుకు కృషి చేస్తున్నామని తెలిపారు. రైల్వే ఇండస్ట్రీస్ తీసుకురావడానికి కృషి చేస్తున్నామని, త్వరలోనే ఇది నెరవేరనుందని తెలిపారు. రాబోయే రోజుల్లో బోగోలు, విశ్వనాధరావుపేట కలిపి మున్సిపాలిటీలో అయ్యే అవకాశం ఉందని, ఆ దిశగా అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో బోగోలు మండల టీడీపీ అధ్యక్షులు మాలేపాటి నాగ్వేశ్వరరావు, కావలి నియోజకవర్గ జనసేన ఇంచార్జి అలహారి సుధాకర్,గ్రామ సర్పంచ్ గండూరి మంజుల టీడీపీ, బీజేపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

# ముడమాలతో కమ్యూనిస్టు మాలకొండయ్య భేటీ



**ఉదయగిరి, జనవరి 16, ప్రభాతవార్త** ఉదయగిరి నియోజకవర్గ భారతీయ జనతా పార్టీ యువ నాయకులు ముడమాల రమేష్‌రెడ్డితో కమ్యూనిస్టు మాలకొండయ్య గురువారం భేటీ అయ్యారు. రమేష్‌రెడ్డిని కలిసిన ఆయన కేంద్రంలో బీజేపీ అధికారంలో ఉండటం కలిసి వచ్చే అంశమని, ఉదయగిరినియోజకవర్గ అభివృద్ధికి సహకరించాలని ఈ ప్రాంతంలో సాగు తాగునీరు లేక అన్ని రంగాల్లో వెనుకబడి ఉందని, ఈ నియోజకవర్గ సమస్యలను రాష్ట్ర కేంద్ర స్థాయి నాయకుల అధికారుల దృష్టికి తీసుకెళ్లాలని మాలకొండయ్య కోరారు. ముడమాల రమేష్‌రెడ్డి మాట్లాడుతూ నియోజకవర్గ నియోజకవర్గ సమస్యలపై నియోజకవర్గ సంపూర్ణ అవగాహన కలిగి ఉన్న సీనియర్లు తమతో కలిసి ముందుకు నడిస్తే నడిపిస్తే సమస్యలు పరిష్కారం అవుతాయని ఈ ఐదేళ్లలో నియోజకవర్గ సమస్యలు 100 శాతం పూర్తి అవుతాయని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. అనంతరం సీనియర్ నాయకులను కలవాలన్న ఉద్దేశంతో ఉదయగిరి మాజీ గ్రంధాలయ ఉద్యోగి వెంకట సుబ్బయ్య, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు అజిత్, మాజీ ఎంపీటీసీ ప్రస్తుత నాయిబ్రాహ్మణ సేవా సమితి జిల్లా అధ్యక్షులు ఆదర సుబ్రహ్మణ్యం, అప్ప సముద్రం మాజీ సర్పంచ్ యోహోషువ, పుల్లాయపల్లి మాజీ సర్పంచ్ కంభాల నరసింహారెడ్డి, నందిపాడు మాజీ సర్పంచ్ చప్పిడి హజరత్తయ్యలను వేర్వేరుగా రమేష్‌రెడ్డి కలిసి బీజేపీలోకి ఆహ్వానించారు. తలుపులు తెరిస్తే బీజేపీలోకి వచ్చేందుకు నాయకులందరూ సిద్దంగా ఉన్నారని నియోజకవర్గంలో బీజేపీ పూర్తి స్థాయిలో బలపడబోతుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ఈయన వెంట బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఆవుల రోశయ్య యాదవ్ కూడా ఉన్నారు.

# కృష్ణంపల్లి, శకునాలపల్లి గ్రామాలలో పొలం పిలుస్తోంది కార్యక్రమం

ఉదయగిరి, జనవరి 16, ప్రభాతవార్త ఉదయగిరి మండల పరిధిలోని కృష్ణంపల్లి, శకునాలపల్లి గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం ఏవో ఆంజనేయులు నాయక్ గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా ఉదయగిరి వ్యవసాయాధికారి ఆంజనేయులు నాయక్ పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో క్షేత్రస్థాయిలో ఉలవ, వరి పంటలను పరిశీలించారు. వరిలో ఉల్లికోడు, ఆకు ముడత ఉధృతంగా ఉండటం గమణించారు. దీనిపై సస్యరక్షణ చ్యలు పాటించాలని రైతులను కోరారు. అదే విధంగా కొన్ని సలహాలు సూచనలు, క్షేత్రస్థాయిలో వివరించారు. ఉల్లికోడు నివారణకు ఫ్రిఫోనిల్ 5శాతం ఎస్‌సీ 400- 6000 ఎంఎల్ లేదా కార్బోఫ్యూరాన్ 3జీ గుళికలు 10 కేజీ ఎకరాకు వాడాలని కోరారు. ఆకు ముడత నివారణకు పొలం ఇరువైపులా నుండి తాడు లాగాలని సూచించారు. మండలంలోని రైతులందరూ రబీ సీజన్లో వేసినటువంటి పంటలను తప్పనిసరిగా గ్రామ వ్యవసాయ సహాయకులచే ఈ పంట నమోదు చేయించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామ వ్యవసాయాధికారులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.



## పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి

కోవూరు జనవరి 16 ప్రభాతవార్త : కోవూరు పంచాయతీ పరిధిలోని పలు ప్రాంతాల్లో జరుగుతున్న పారిశుధ్య పనులను గురువారం ఈవోపీఆర్డీ శ్రీనివాసులు ఆకస్మికంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు కూడా చెత్తాచెదారాలను ఎక్కడంటే అక్కడ పడవేయకుండా పంచాయతీ ఏర్పాటు చేసిన చెత్త కుండీలను ఉపయోగించుకోవాలన్నారు. ఇటీవల జాతీయ మానవ హక్కుల కమిషన్ సభ్యురాలు విజయభారతి ఆకస్మిక తనిఖీలతో కోవూరు పంచాయతీ పరిధిలో పారిశుధ్యం ఘననీయంగా మెరుగుపడింది.



# గొబ్బెమ్మల నిమజ్జన కార్యక్రమంలో పాల్గొన్న రాష్ట్ర పురపాలక పట్టణాభివృద్ధి శాఖ మంత్రి నారాయణ

























ఫోటోలు : నంద మాల్యాద్రి

## కుష్టు వ్యాధి సర్వే పక్కాగా నిర్వహించండి



**నెల్లూరు, జనవరి 16, ప్రభాతవార్త-వైద్యం :** జిల్లాలో నిర్వహిస్తున్న ఇంటింటి కుష్టి వ్యాధి సర్వేని పక్కాగా లెప్రసీ, ఎయిడ్స్, టీబీ అధికారి డాక్టర్ షేక్ ఖాదర్‌వలి ఆదేశి ంచారు. ఈనెల 20నుంచి వచ్చే నెల 2వ తేదీ వరకు రాష్ట్రమంతటా, నెల్లూరు జిల్లా అంతటా ఇంటింటికి కుష్టి వ్యాధి సర్వే కార్యక్రమం జరుగు తోందన్నారు. ఈ సందర్భంగా గురువారం నగర ంలోని జేఎన్ఆర్ కాలనీ, కపాటి పాలెం అర్బన్ ఆరోగ్య కేంద్రాలలో ఏఎన్ఎమ్స్‌కి ట్రైనింగ్ ఇస్తున్నారు. ఈ కార్యక్రమానికి ఖాదర్‌వల్లి విచ్చేసి మాట్లాడుతూ వ్యాధిని ప్రారంభ దశలోనే కనుక్కుంటే కుషుటన వ్యాధిని పూర్తిగా నయం చేయవచ్చు అన్నారు. కుష్టు వ్యాధిపైన అపోహలు విడనాడాలని ఈ విషయాన్ని ప్రతి ఒక్క వైద్య సిబ్బంది జనాలకు తెలియజేయాలని ఆదేశం చారు. అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు పట్టణ ఆరోగ్య కేంద్రాల్లో కుష్టి వ్యాధికి సంబంధించి మందు లు అందుబాటులో ఉన్నాయని తెలియజేశారు. ప్రతి ఆశా కార్యకర్త, ఒక మగ వాలంటీరు ఇంటింటికి వెళ్లి ఈ సర్వే కార్యక్రమాన్ని 14 రోజులు సక్రమంగా నిర్వహి ంచాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జేఎన్ఆర్ కాలనీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ టి.మానస, డాక్టర్ పర్వీన్‌లు కపాటిపాలెం మెడికల్ ఆఫీసర్ డాక్టర్ కళ్యాణ్, సీఓ విజయలక్ష్మీ, డీపీఎంఓలు బీవీ సుబ్బయ్య, వై.రమణారెడ్డి, రెండు యూపీఎస్సీల ఏఎన్ఎం, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

## విద్యుత్‌కి అంతరాయం

**నెల్లూరు, జనవరి 16, ప్రభాతవార్త-వైద్యం :** నగర నియోజకవర్గ పరిధిలోని 33/11 కేవీ శెట్టిగుంట రోడ్డు సబ్ స్టేషన్ పరిధిలోని రోడ్డు వెడల్పు చేసిన కారణంగా విద్యుత్ స్తంభాలను మార్చేందుకు ఆ సబ్ స్టేషన్ ప్రాంతంలో ఉన్న అరవింద్ నగర్, ప్రశాంతి నగర్, పల్లిపాడు రోడ్డు, కిసాన్ నగర్, సింహపురి కాలనీ, మైపాడు రోడ్డు, వేణుగోపాల్ నగర్ పరిసర ప్రాంతాల్లో ఉదయం 8గంటల నుండి సాయంత్రం 5గంటల వరకు శుక్రవారం విద్యుత్ సరఫరా నిలిపివేయడం జరుగుతుందని, వినియోగదారులు ముందస్తు చర్యలు తీసుకోవాలని, అత్యవసర విభాగం వారు తగిన ఏర్పాట్లు చేసుకోవాలని విద్యుత్ శాఖ నెల్లూరు టౌన్ డివిజన్ ఆపరేషన్ ఎగ్జిక్యూటీవ్ ఎం.శ్రీధర్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

## వ్యవసాయ శాఖ సలహాలు సూచనలు పాటించాలి



**కోవూరు జనవరి 16 ప్రభాతవార్త :** ప్రస్తుతం వ్యవసాయం సాగు చేసే రైతులు వ్యవసాయ శాఖ సలహాలు, సూచనలు తప్పక పాటించాలని సహాయ వ్యవసాయ సంచాలకులు సుజాత అనా న్నరు. కోవూరు మండలం పోతిరెడ్డి పాలెం, కోవూ రు ప్రాంతాల్లో గురువారం పొలం పిలు స్తోంది కార్యక్రమంలో భాగంగా రైతులకు పలు విషయాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రస్తుతం పైరు పిలకల దశలో ఉందని, ఇప్పటివరకు జింక్ సల్ఫేట్ పిచికారి చేయని రైతులు వారానికి రెండు సార్లు జింక్ పిచికారి చేయాలన్నారు. ముఖ్యంగా జింక్ పిచికారి చేసిన తర్వాత మాత్రమే ఎరువులు వాడుకోవాలన్నారు. చివరి ఎరువు మోతాదు వేసే లోపల పొటాష్‌ను తప్పకుండా వాడుకోవాలని సూచించారు. దీని వలన పైరులో వ్యాధి నిరోధక శక్తి పెరిగి పోటాకు దశలో పచ్చ పురుగు, మెడవిరుపు మోము పిప్పి దోమల బారిన పడకుండా కాపాడుకోగల సామర్థ్యం పొటాష్‌లో ఉందన్నారు. మండల వ్యవ సాయాధికారిణి ఇందిరావతి మాట్లాడుతూ రైతులంగా ఎలుకల నివారణకు సామూహికంగా బ్రోమోడయోలిన్ మందులు వాడి వీటి నివారణ చేపట్టాలన్నారు. 96 శాతం నూకలు, రెండు శాతం వంట నూనె, రెండు శాతం ఈ మందు కలిపి వాడుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ సహాయకులు చైతన్య, చాద్విక, రైతులు ఉన్నారు.

## ఘనంగా అన్నదానం



**కోవూరు జనవరి 16 ప్రభాతవార్త :** కోవూరులోని ప్రధాన రహదారిలో వెలసి ఉన్న శ్రీ చెన్నకేశవ స్వామి దేవస్థానం ప్రాంగణంలో సంక్రాంతి ఉత్సవాల ముగి ంపు సందర్భంగా గురువారం ఆలయంలో పడుగు పాడు సహకార సొసైటీ సీఈవో గోవర్ధన్‌రెడ్డి ఆధ్వర్యంలో స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భారీ స్థాయిలో అన్నదానం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సొసైటీ సీఈవోను ఆలయ మర్యాదలతో స్వాగతించారు. ఈ కార్యక్రమంలో చుట్టుపక్కల ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో సొసైటీ ఉద్యోగులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## కోవూరు సబ్ డివిజన్‌లో 80 శాతం పశుగణన



**కోవూరు జనవరి 16 ప్రభాతవార్త :** కోవూరు పశు సంవర్ధక శాఖ సబ్ డివిజన్ పరిధిలోని కోవూరు , విడవలూరు మండలానికి సంబంధించి పశు గణన కార్యక్రమం గురువారం నాటికి 80 శాతం పూర్తి కావడం జరిగిందని పశు సంవర్ధక శాఖ సహాయ సంచాలకులు డాక్టర్ కృష్ణమౌర్య అన్నారు. స్థానిక శాంతినగర్‌లో ఉన్న పశు వైద్యశాలలో గురువారం ఆయన మాట్లాడుతూ పశు సహాయకులు చేపట్టే ఈ పశు గణన కార్యక్రమానికి వైద్యులు తమవంతుగా పూర్తిస్థాయిలో సమాచారం ఇవ్వాలన్నారు. ఈ పశుగణన చేపడితే రైతులకు కూడా ఎన్నో ఉపయోగాలు ఉన్నాయన్నారు. ప్రధానంగా ప్రభుత్వం పశు సంవర్ధక శాఖ ద్వారా విడుదల చేసే పథకాలు అర్హత కలిగిన పాడి రైతులకు అందించేందుకు ఈ గణన కార్యక్రమం ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. ప్రధానంగా రైతులు వారి దగ్గర ఉన్న గేదెలు, ఆవులు, పశువులు, కోళ్లు, గొర్రెలు, మేకలతో పాటు ఇతరత్రా ఎటువంటి జంతువులు ఉన్నా ఈ సర్వేకు వచ్చిన ఎనిమిరేటర్లకు పూర్తి సమాచారం ఇవ్వాలన్నారు. గురువారం నాటికి కోవూరు మండలంలో 22163 గృహాలకు సర్వే చేయాల్సి ఉండగా.. ఇప్పటివరకు 17642 గృహాలకు ఈ పశుగణన సర్వే కార్యక్రమం చేపట్టడం జరిగిందన్నారు. అదేవిధంగా విడవలూరు మండలానికి సంబంధించి మొత్తం 14079 గృహాలకు చేయాల్సి ఉండగా.. ఇప్పటివరకు 12028 గృహాలకు ఈ పశు గణన సర్వే పూర్తి చేయడం జరిగిందన్నారు.

## రాధన్న పరామర్శ



**కోవూరు జనవరి 16 ప్రభాతవార్త :** కోవూరు పంచాయతీ పరిధిలోని శాంతినగర్‌లో నివాసం ఉంటున్న వైసీపీ నేత మావులూరు వెంకటర మ ణారెడ్డి తల్లి వనమ్మ ఇటీవల మృతిచెందారు. ఈ నేపథ్యంలో గురువారం జిల్లా వైసీపీ ఉపాధ్యక్షుడు పచ్చిపాల రాధాకృష్ణారెడ్డి వారి నివాసానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించి తన సానుభూతిని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు ఎం. సుప్రజ, శ్రీనివాసులురెడ్డి, సత్యనారాయణరెడ్డి , తదితరులు ఉన్నారు.

## శాస్వతసభ్యత్వం తీసుకున్న శ్రీకాంత్‌యాదవ్



**వరికుంటపాడు, జనవరి16, ప్రభాతవార్త:** ఉదయగిరి శాసనసభ్యులు కాకర్ల సురేష్ నేతృ త్వంలో తెలుగు దేశంపార్టీ శాస్వతస భ్యత్వాన్ని వరికుంటపాడు మండల తెలుగు దేశంపార్టీ ప్రధానకార్యదర్శి పోలుబోయిన శ్రీకాంత్ యాదవ్ పొందారు. అధికారపార్టీ నాయకుడిగ కొనసాగు తున్న పోలుబోయిన శ్రీకాంత్‌యా దవ్ లక్ష రూపా యలు చెల్లించి పార్టీ శాస్వత సభ్యత్వాన్ని తీసుకొని పార్టీపై తన అభిమా నాన్ని మరోమారు చాటుకు న్నారు. తన గ్రామమైన కనియంపాడులో నాలుగొం దలకుపైగ సభ్యత్వాలు శ్రీకాంత్‌యాదవ్ చేయిం చడంతో ఉదయగిరి శాసనసభ్యులు కాకర్ల సురేష్ అభినందించారు. ఈ కార్యక్రమంలో మండల తెలుగుదేశంపార్టీ కన్వీనర్ చంద్ర మధుసూదన్‌రావు, జెట్‌పిటిసి సభ్యులు రావెళ్ళ నాగేంద్ర, నాయకులు పోకా మహేశ్వరరావు, వడ్లమూడి నాగేంద్ర, అరవ రవీంద్ర, తదితరులు పాల్గొన్నారు.

## పిల్లల హాజరు శాతాన్ని మరింత పెంచాలి



**కోవూరు జనవరి 16 ప్రభాతవార్త :** పూర్వ ప్రాథమిక పాఠశాలలో విద్య నభ్యసిస్తున్న విద్యార్థుల శాతాన్ని మ రింత పెంచాల్సిన అవసరం ఉందని ఐసీడీఎస్ పీడీ సీహెచ్ సుశీలాదేవి అన్నారు. కోవూరు పంచాయతీ పరి ధిలోని పెళ్లకూరు కాలనీలో ఉన్న మూడు అంగన్‌వాడీ కేంద్రాలను గు రువారం ఆమె ఆకస్మికంగా పరిశీలిం చారు. ఆమె చిన్నారులతో ఉదయం పాలు, గుడ్డు ఇచ్చారా అని అడిగి తెలుసుకున్నారు. ప్రతి అంగన్‌వాడీ కేంద్రంలో ప్రతి నెల 10వ తేదిలోగా చిన్నారులకు సంబంధించిన ఎత్తు బరువు తూచి ఆన్‌లైన్ యాప్‌లో తప్పక నమోదు చేయాలన్నారు. ముఖ్యంగా కేంద్రాల పరిధిలోని గర్భవతులకు, బాలింతలకు క్రమం తప్పకుండా పౌష్టికాహారం అందించడమే కాకుండా వారికి పౌష్టికాహారంపై మరింత అవగాహన పెంచేలా దృష్టి పెట్టాలన్నారు. అదేవిధంగా కేంద్రాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ఈ సందర్భంగా విద్యార్థుల యొక్క జ్ఞాపకశక్తిని పరిశీలించి వారిని ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో సీడీపీవో జ్యోతి, సూపర్‌వైజర్ రాధిక, ఈవో సునీత, అంగన్‌వాడీ కార్యకర్తలు ధనలక్ష్మి, నాగమ్మ, సుమతిలు ఉన్నారు.

## వైభవంగా పల్లకి సేవ



**కోవూరు జనవరి 16 ప్రభాతవార్త :** కోవూరులో వెలసి ఉన్న శ్రీ వీరాంజనేయ స్వామి దేవ స్థానంలో పుష్య మాస ముక్కనుమ పర్వదినం సందర్భంగా ఆలయంలో స్వామివారికి ప్రధాన అర్చకులు నాగరాజాచార్యుల ఆధ్వర్యంలో అభిషేక పూజలను సాంప్రదాయబద్ధంగా భక్తిశ్ర ద్ధలతో నిర్వహించారు. అనంతరం స్వా మివారికి పల్లకి సేవ కార్యక్రమాలను కన్నుల పండువగా చేపట్టారు. ఈ కార్యక్రమానికి ఉభ యకర్తలుగా పంగులూరు నరసింహారావు, సునీ ల్, సంతోషి, వారి కుటుంబ సభ్యులు వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో రుత్వికులు సుబ్బయ్య స్వామి, నందకుమార్ స్వామి, ఫణీంద్ర స్వామి, భక్తులు ఉన్నారు.

## గుబ్బా రామయ్య జ్ఞాపకార్థం పేదలకు వస్త్రదానం



**బుచ్చి జనవరి 16 ప్రభాతవార్త** బుచ్చిరెడ్డిపాళెం వాసవీనగర్‌లోని ఆర్యవైశ్య ప్రముఖులు, తెలుగుదేశం నాయకులు గుబ్బా సురేష్ ఆయన సతీమణి సుకృత లక్ష్మీ పేదలకు వస్త్రదానం చేశారు. ఈ సందర్భంగా గుబ్బా సురేష్ మా ట్లాడుతు తన తండ్రి జ్ఞాపకార్థం పేదలకు వస్త్ర దానం చేసినట్లు తెలిపారు. సంక్రాంతి పర్వదినం రోజు ఒకసారి, మాతండ్రి జ్ఞాపకార్థం మరోసారి రెండు రోజులు ఈకార్యక్రమాన్ని నిర్వహించడం జరిగిందని ఆయన తెలిపారు. లుంగీలు, చీరలు , టీషర్టులు, చలికోట్లు ఇలాఅనేక రకాల వస్త్రాలు అందజేసినట్లు ఆయన పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో కొంతమంది పేదలకు వస్త్రాలు కప్పి వారిని సంతోషింప చేశారు.

## భక్తి శ్రద్ధలతో పుట్టాలమ్మ తల్లి లడ్డు వేలం పాట



**బుచ్చి జనవరి 16 ప్రభాతవార్త** బుచ్చిరెడ్డి పాళెం మండలంలోని రేబాల గ్రామంలో ఏటా సంక్రాంతి పురస్కరించుకొని పుట్టాలమ్మ తల్లి వేడుకలు ఘనంగా నిర్వహిస్తారు. రేబాల గ్రా మానికి పెద్దఎత్తున ప్రజలు తరలివస్తారు. ఈ కార్యక్రమంలో అమ్మవారి లడ్డు వేలంపాట నిర్వహించగా గంపల అంకయ్య, దొరడ్ల హేమ వెంకట్ అనే వారు అమ్మవారిని లడ్డుని వేలం పాటలో 64 వేల రూపాయాలకు దక్కించుకు న్నారు. నిర్వాహకులు వారికి లడ్డుని అందజేశారు.

## వరిలో కాండం కుళ్ళు తెగులు నివారణ



**మర్రిపాడు, జనవరి16, ప్రభాతవార్త:** మండలంలోని చినమాచనూరు, రామా నాయుడుపల్లి గ్రామాల్లో మండల వ్యవసాయాధికారి ఎస్.రామ్మోహన్ గురువారం పొలం పిలుస్తోంది కార్య క్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భం గా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం గ్రా మాల్లో సాగులో ఉన్న వరిపంటను పరిశీలించామని కాండం కుళ్ళు తెలుగు ఉన్నట్లు గుర్తించామన్నారు. ఈ తెగులు ఉన్న పొలంలో ముదురు ఆకులు పసుపురంగుకు మారి పిలకలు చనిపోతుంటాయన్నారు. వీటి మొదళ్ళ వద్ద ఆకు తొడిమపై నల్లటి మచ్చలు ఏర్పడి లోపలికాండానికి విస్తరించి కణుపుల మధ్య భాగం అంతా నల్లగా మారుతాయన్నారు. దీని నివారణకు మొదట నీరుని తీసివేసి పొలాన్ని ఆరబెట్టాలన్నారు. వాలిడామిసిన్‌ను ఎకరాకి 400మి.లీటర్లు లేదా హెక్సా కొనజోల్ 400మి.లీ లేదా ప్రొఫికొన్నజోల్ 200మి.లీ ఒక ఎకరాకు పిచికారి చేయాలన్నారు. పిచికారీ చేసేటప్పుడు మొదల్లు తడిచే విధంగా పిచికారీ చేయాలన్నారు. పొటాష్ ఎరువులను తప్పకుండా వేసుకోవాలన్నారు. ఈకార్యక్రమంలో వివిఎలు ఎస్.కె.షాజియ, పి.మల్లిక, రైతులు పాల్గొన్నారు.

## క్రికెట్ కిట్లు పంపిణి



**వరికుంటపాడు, జనవరి16, ప్రభాతవార్త:** యువతను క్రీడలవైపు మరింత ఆకర్షితులను చేయడంకోసం జనసేనపార్టి ఆధ్వర్యంలో మండలంలోని తోటలచెరు వుపల్లి యువతకు క్రికెట్ కిట్లను జనసేన నేతవెం గళ్‌రావు సమకూర్చిన కిట్లను జనసేన, టిడిపి నేతలు వల్లపుశెట్టి సభాపతి, పత్తి రవికుమార్, గురుప్రసాద్‌లు గురువారం పంపిణిచేశారు. స్థానిక పాఠశాల ఆవరణలో జరిగిన కార్యక్రమంలో యువకులతోపాటు చిన్నారు లకుసైతం క్రికెట్ కిట్లను అందజేశారు. ఈసందర్భంగ దాత మాట్లాడుతు రానున్న రోజులలో యువతకు అవసరమైన క్రీడా పరికరాలను అందజేయడంతోపాటు మైదానంలో వసతులకల్పనకు కృషిచేస్తానని హామీఇచ్చారు. ఈ కార్య క్రమంలో యువత, నాయకులు పాల్గొన్నారు.

## ఎసిబి డీఎస్పీ రమేష్‌ను సత్కరించిన అమరా



**కావలి, జనవరి16 ప్రభాతవార్త :** ఖమ్మం ఎసిబి డీఎస్పీ ఏకాంబరం రమేష్‌ను కావలిలోని ఆయన నివాసంలో కావలి వైసిపినేత, ప్రముఖ వస్త్రవ్యాపారి, ఆర్యవై శ్యమహాసభ రాష్ట్రనేత అమరావేదగిరి సుబ్బరాయు డు గుప్తా మర్యాద పూర్వకంగా గురువారం కలిశారు. ఎసిబి డీఎస్పీ రమేష్‌ను దుశ్శాలువాతో సత్కరించి, పండ్లబొకే అందచేశారు. శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం 1983 10వ తరగతి బ్యాచ్ బాల్యమిత్రులు ఎసిబి డీఎస్పీని ఘనంగా సత్క రించారు. వెంకారెడ్డి, బొగ్గవ రపు శ్రీనివాసులు (అన్నపూర్ణ శ్రీను), టీచర్ ప్రసాద్, ఏల్చూరి వెంకటరవికుమార్, కొత్తూరు సుకుమార్, తదితరులు పాల్గొన్నారు.

## కోనలో ఆధిలక్ష్మీ అమ్మవారికి వనమహోత్సవం



పెంచలకోన(రాపూరు), జనవరి16ప్ర భాతవార్త ప్రముఖ పుణ్యక్షేత్రమైన పెంచలకోనలో ముక్కనుమ పం డుగ పర్వదినాన్ని పురస్కరించుకోని గురువారం ఆధిలక్ష్మీ అమ్మవారికి వనమహోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి స్వా మి వారి ఉద్యానవనంలో వేదపం డితులు వేదమంత్రాలతో అమ్మ వారికి ప్రత్యేక పూజలు నిర్వహించా రు. ఈ కార్యక్ర మంలో ఆలయ ప్రధానార్చకులు రామయ్య స్వామి, పెంచలయ్య స్వామి, అర్చక స్వా ములు శశి స్వామి, ఆలయ సీని యర్ సహాయకుడు పాలవల్లి లక్ష్మీ నారాయణ తదితరులున్నారు.

## కుష్టు వ్యాధిగ్రస్తులను గుర్తించండి



**ఉదయగిరి, జనవరి 16, ప్రభాతవార్త** ఉదయగిరి మండల పరిధిలోఇన గండిపాలెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో కుష్టు వ్యాధిగ్రస్తులను గుర్తించాలని వైద్యాధికారిణి ఎన్.వినీత సిబ్బంది సూచించారు. ఈ సందర్భంగా గురువారం మాట్లాడుతూ ఉదయగిరి వ్యాక్సినేషన్ కేంద్రంలో ఆశాడే కార్యక్రమం నిర్వహిం చారు. అనంతరం ఆమె మాట్లాడుతూ చర్మంపై స్పర్శలేని మచ్చలు లెప్రసీకి సూచనలు అన్నారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్యవిద్య, వైద్యాధికారి కలసపాటి వెంకట సుబ్బయ్య, శివకుమారి, అంకమ్మ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

## టిడిపి శాశ్వత సభ్యత్వం తీసుకున్న రాజశేఖర్



**సీతారామపురం జనవరి 16 ప్రభాతవార్త:** ఉదయగిరి నియోజకవర్గ శాసనస భ్యులు కాకర్ల సురేష్ పిలుపు మేరకు సీతారామపురం మండలంలోని మండల మాజీ ప్రజాపరిషత్ ఉపాధ్యక్షులు సోమన బోయిన రాజశేఖర్ తెలుగుదేశం పార్టీ శాశ్వత సభ్యత్వం తీసుకున్నారు. వారిని ఎమ్మెల్యే కాకర్ల సురేష్ ప్రత్యేకంగా అభినందించారు.

## నిరుపేద గిరిజనులకు నూతన వస్త్రాలు పంపిణి



**కావలిరూరల్, జనవరి16 ప్రభాతవార్త :** కావలి 6వ వార్డుపరిధిలోని గిరిజన కాలనీలోని నిరుపేద గిరిజనులకు, అంగన్‌వాడీకేంద్రంలో ఉన్న చిన్న పిల్లలకు కావలి పట్టణ న్యాయవాది ఐ.సాయిప్రసాద్ పుట్టినరోజు సంద ర్భంగా గురువారం నూతన వస్త్రాల ను, లెక్కల పుస్తకాలను పంపిణి చేయడం జరిగింది. ఈ సందర్భంగా ఐ.సాయిప్రసాద్ మాట్లాడారు. తమ పిల్లలను బడికి పంపాలని, బడిఈడుపిల్లలు పాఠశాలల్లో ఉండాలని తెలియచేశారు. 12 సంవత్సరాలలోపు పిల్లలందరూ బడికివెళ్లి విద్యను అభ్యసించాలని కోరడం జరిగింది. ప్రభుత్వంవారు కల్పించే వసతులు ఉప యోగించుకుని శ్రద్ధగా చదువుకుని పాఠశాలస్థాయినుంచి క్రమశిక్షణ నేర్చుకుని ఉన్నతశిఖరాలకు చేరు కోవాలంటే విద్య ఎంతగానో ఉపయోగపడుతుందని తెలియచేశారు. తల్లిదండ్రులు తమ పిల్లలను కూలి పనులకు దూరంగా ఉంచాలని తెలియచేశారు. ఉన్నత విద్యను పిల్లలకు అందించి మంచి ప్రయోజకులుగా తీర్చిదిద్దాలని తెలియచేశారు. బాల్యవివాహాలు చేయడం నేరమని అక్కడ ఉన్న గిరిజనులకు బాల్యవివా హాలపై అవగాహన కల్పించడం జరిగింది. న్యాయవాదులు అభిసాగర్, చంద్రశేఖర్‌రెడ్డి, సాయికృష్ణ, సామాజిక కార్యకర్త ఎం.మాలకొండారెడ్డి, అంగన్‌వాడి టీచర్ పద్మకుమారి, ఆయా లక్ష్మి, పాల్గొన్నారు.

## చౌకచర్లలో పొలం పిలుస్తుంది



**విడవలూరు, జనవరి 16, ప్రభాతవార్త :** మం డలం చౌక చర్ల గ్రామం నందు పొలం పిలు స్తుంది కార్యక్రమం మండల వ్యవసాయ అధికారి పి. వెంకట కృష్ణయ్య ఆధ్వర్యంలో నిర్వ హిం చారు. ఈ సందర్భంగా ఆయన రైతు లతో మా ట్లాడుతూ బ్రోమో డయాలిన్ మందుతో ఎలుక లను నివారిం చవచ్చునని రైతులుకు తెలియ జేశారు. ఈ మం దును రైతులకు ఉచితంగా అందిచడం జరిగింద న్నారు. 100 గ్రాముల ప్యాకె ట్‌ను 20 ఎకరాలకు వాడవచ్చు అని రైతులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో రైతులు, తదితరులు పాల్గొన్నారు.

## ముగిసిన క్రికెట్‌టోర్నమెంట్స్ పోటీలు



**మర్రిపాడు, జనవరి16 ,ప్రభాత వార్త:** చుంచులూ రులో గత నాలుగు రోజులుగా జరుగు తున్న కంచి వెంకటసుబ్బయ్య స్మారక క్రికెట్ టోర్నమెంట్ పో టీలు గురు వారంతో ముగిశా యి. ఈపోటీల్లో రాజుపాళెం జ ట్టు విన్నర్‌గాను, చంఉచులూరు జట్టు రన్నర్‌గాను నిలిచాయి. మొదటి స్థా నంలో నిలిచిన జట్టుకు 20,116రూ పాయలు, ట్రోపిని, ద్వితీ య స్థానంలో నిలిచిన జట్టుకు 15,116రూపాయలు, ట్రోపిని మర్రి పాడు సబ్‌ఇన్స్‌పెక్టర్ కాసుల శ్రీని వాసులు, టోర్నమెంట్ నిర్వాహకులు కంచి రాము అందజేశారు. సందర్భంగా మర్రిపాడు ఎస్ఐ శ్రీనివా సులు మాట్లాడుతూ సామాజిక మాధ్యమాల మోజులోపడి యువత జీవితాలను దుర్భరం చేసుకుం టున్నారని , క్రీడల మీద వారి దృష్టిని మరల్చడం ద్వారా వారిలో శారీరక , మానసిక ధృఢత్వం ఏర్పడి సన్మార్గంలో పనయనించడానికి అవకాశం ఉంటుందన్నారు. నేరాల నియంత్రణ చర్యల్లో భాగంగా చుం చులూరు హైవే పై సిసి కెమెరాలు ఏర్పాటు చేసేందుకు దాతలు ముందుకు రావాలని కోరగా వాటిని ఏర్పా టు చేసేందుకు కంచి రాము అంగీకరించారు. ఈకార్యక్రమంలో ఎపిఎస్పిఇసిఎల్ అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కలిశెట్టి రఘు, గ్రామపెద్దలు కలిశెట్టి వెంకటరమణయ్య, జొన్నా సత్యనారాయణ, దువ్వూరు జయదేవ్, ఇరుకుమాటి మురళి, కలిశెట్టి శివరావ్, యలగాల వెంకటేశ్వర్లు, బత్తలపల్లిరోశిరెడ్డి, ఇం దూరు నరసారెడ్డి, వేమన వినోద్, వేమన సుబ్రహ్మణ్యం , రవీంద్ర కుమార్, రాజేంద్రకుమార్, జొన్నా రాగదీప్, మురళి, కృష్ణమాచార్యులు, సుబ్బారెడ్డి, నాగరాజు, వెంకటేశ్వర్లు, శేషయ్య పెద్దకొండయ్య, రాజా , శ్రీనివాసులు, సుమన్, శైలేంద్ర, అన్వేష్ ,క్రీడాకారులు గ్రామస్తులు పాల్గొన్నారు.

**డాక్యుమెంటు పోయినది**

నక్కా సాయిరాంప్రసాద్ తండ్రి లేట్ రాఘవయ్య పేరిట కావలి సబ్ రిజిస్ట్రారు ఆఫీసులో నెం:4570/ 2019 గా రిజిస్టరు కాబడిన కావలి ముసునూరు పరిధిలోని ఇంటి స్థలం తాలూకు ఒరిజినల్ దాక్యుమెంటును జెరాక్స్ కొరకు తీసుకొని వెళుతుండగా కావలి విష్ణాలయం సెంటర్ నందు పోయినది. ఎవరికైనా దొరికిన యెడల క్రింది సెల్ నెంబరుకు తెలియజేయగలరు.
సెల్: 94941 46130

**పంజాబ్ నేషనల్ బ్యాంక్**
(భారత ప్రభుత్వ రంగ సంస్థ)
... విశ్వాసానికి మరో పేరు !

**CIRCLE SASTRA CENTRE**
డి.నెం.9-35, కావూరి టవర్స్, 1వ అంతస్తు, కామయ్య తోపు సెంటర్, కానూరు, విజయవాడ - 520007, ఆంధ్రప్రదేశ్. E Mail: cs8332@pnb.co.in

**డిమాండ్ నోటీసు** (చర/స్థిరాస్తుల కొరకు)

ఈ దిగువ తెలిపిన ఋణగ్రహీతకు ఈ నోటీసు జారీ చేయబడినది : వారు బ్యాంకు నుండి పొందిన ఋణములను మరియు వడ్డీలను చెల్లించుటలో విఫలమైనందున సదరు ఖాతా నిరర్థక ఖాతా (NPA)గా వర్గీకరించబడినది. కావున మీరు చివరిగా తెలిపిన చిరునామాకు సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం 2002 యొక్క సెక్షన్ 13(2) ప్రకారం నోటీసు జారీచేయబడినది. కానీ అది బట్వాడా కాకుండా తిరిగి వచ్చినది. కావున ఈ బహిరంగ ప్రకటన ద్వారా మీకు తెలియజేయడమైనది.

I) ఋణగ్రహీత యొక్క పేరు మరియు చిరునామా: మెస్సర్స్ మదీనా రిట్రేడింగ్ కంపెనీ, ప్రొప్రయిటర్ : షేక్ హుస్నేన్ బీబీ, ప్లాట్ నెం.3, వుడ్ కాంప్లెక్స్, అయ్యప్ప గుడి ఎదురుగా, గుంటూరు రోడ్డు, నెల్లూరు, ఆంధ్రప్రదేశ్ - 524004. శ్రీమతి షేక్ హుస్నేన్ బీబీ, భర్త : షేక్ రహమతుల్లా, ఇ.నెం.26-2-936, 7వ వీధి, జ్యోతి నగర్, వార్డు-26, నెల్లూరు, ఆంధ్రప్రదేశ్ - 524004. శ్రీ షేక్ రహమతుల్లా (హామీదారు), తండ్రి : మీరా సాహెబ్, ఇ.నెం.26-2-936, 7వ వీధి, జ్యోతి నగర్, వార్డు-26, నెల్లూరు, ఆంధ్రప్రదేశ్ - 524004. వేరొక చిరునామా: మెస్సర్స్ మదీనా రిట్రేడింగ్ కంపెనీ, ప్రొప్రయిటర్ : షేక్ హుస్నేన్ బీబీ, వార్డు - 16/2, డోర్ నెం.3180 దగ్గర, సుభాష్ చంద్ర బోస్ నగర్, వేదాయపాలెం ఏరియా, నెల్లూరు, ఆంధ్రప్రదేశ్ - 524004. వేరొక చిరునామా: శ్రీమతి షేక్ హుస్నేన్ బీబీ, భర్త : షేక్ రహమతుల్లా, వార్డు - 16/2, డోర్ నెం.3180 దగ్గర, సుభాష్ చంద్ర బోస్ నగర్, వేదాయపాలెం ఏరియా, నెల్లూరు, ఆంధ్రప్రదేశ్ - 524004. వేరొక చిరునామా: శ్రీమతి షేక్ హుస్నేన్ బీబీ, భర్త : షేక్ రహమతుల్లా, ఇ.నెం.25-1/1651, నేతాజీ నగర్, పొదలకూరు రోడ్డు, నెల్లూరు, ఆంధ్రప్రదేశ్ - 524004.

II) లోన్ ఖాతా మరియు అకౌంట్ నెం: 1230210031596-ODTRD, బ్రాంచి : నెల్లూరు (037000)

III) చెల్లించవలసిన బాకీ మొత్తము : తేది.05-01-2025 నాటికి రూ.4,17,024.10 పై (అక్షరాల నాలుగు లక్షల పదిహేడు వేల ఇరవై నాలుగు రూపాయల పది పైసలు మాత్రమే) + తదుపరి వడ్డీ, వ్యయాలు, ఛార్జీలు, ఇతర ఖర్చులు మొదలైనవి.

IV) డిమాండ్ నోటీసు తేది : 09-01-2025. ఎన్‌పిఎ తేది: 21-12-2024

V) ఆస్తి వివరములు: పార్ట్-1 (హైపోథికేషన్‌లో ఉన్న చరాస్తులు): హైపోథికేషన్‌లో ఉన్న వేర్వేరు మెటీరియల్స్ అనగా మ్యానుఫ్యాక్చరింగ్ మెటీరియల్, ఎక్స్ప్రైజబుల్ రా మెటీరియల్స్‌తో గల రా మెటీరియల్స్, ప్రోసెస్‌లోని స్టాక్స్, సెమి-ఫినిష్డ్ గూడ్స్, ఫినిష్డ్ గూడ్స్ (కొనుగోలు చేసిన పూర్తయిన వస్తువులతో సహా) మరియు బుక్ డెట్స్, మిగిలి ఉన్న డిక్రీలు, రావలసిన బకాయిలు, ప్రభుత్వ సబ్సిడీలు, క్లెయిమ్‌లు, బిల్ కాంట్రాక్ట్స్ మరియు ఇన్వెస్ట్‌మెంట్స్ మొ॥నవి.
పార్ట్-2: రిజిష్టర్డు సేల్ డీడ్ నెం.6942/2001, తేది.24.09.2001 ప్రకారం శ్రీమతి షేక్ హుస్నేన్ బీబీ, భర్త : షేక్ రహమతుల్లా గారి పేరున గల ఆస్తి : శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా, నెల్లూరు ఎస్ఆర్ఓ, ఆంధ్రప్రదేశ్ - 524004, శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా, సుభాష్ చంద్రబోస్ నగర్, వేదాయపాలెం, మున్సిపల్ వార్డు నెం.26-2/3180 దగ్గర, ప్లాట్ నెం.3, సర్వే నెం.25/1,25/2,25/3 లోని 178.88 చ॥గల ఏరియా విస్తీర్ణం గల భూమి మరియు అందు గల భవనం యావత్తు ఆస్తి. హద్దులు: తూర్పు : శ్రీమతి కార్యంపూడి నాగేశ్వరి గారికి చెందిన మిగిలిన స్థలం, పడమర : ప్లాట్ నెం.04, ఉత్తరం : ప్లాట్ నెం.03 లోని మిగిలిన స్థలం, దక్షిణం : రోడ్డు.

పైన తెలిపిన ఋణగ్రహీత(లు) మరియు / లేదా వారి హామీదారు(లు) (వర్తించునది)ను ఈ ప్రకటన ప్రచురణ తేదీ నుండి 60 దినములు లోగా బకాయి మొత్తమును చెల్లించవలసినదిగా కోరటమైనది. అట్లు చెల్లించని ఎడల, నోటీసు తేదీ నుండి 60 దినములు ముగిసిన తర్వాత సెక్యూరిటైజేషన్ మరియు రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అస్సెట్స్ మరియు ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం 2002 యొక్క 13వ విభాగంలోని (4)వ ఉప-విభాగం పరిధిలో తదుపరి చర్యలు చేపట్టబడతాయి.
చట్టం యొక్క సెక్షన్ 13 యొక్క సబ్ సెక్షన్ (8) నిబంధనల ప్రకారం ఋణగ్రహీత(లు)/హామీదారు(లు)/పార్ట్‌నర్ తమ తనఖా ఆస్తులను విడిపించుకోవడానికి ఉన్న కాలవ్యవధిని వినియోగించడమునకై శ్రద్ధ వహించవలెను.

తేది : 16-01-2025
ప్రదేశం : విజయవాడ

సం/- చీఫ్ మేనేజర్ & అధీకృత అధికారి
పంజాబ్ నేషనల్ బ్యాంక్

## కూలీల శాతాన్ని పెంచాలి



**కోవూరు జనవరి 16 ప్రభాతవార్త :** మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద పనిచేసే కూలీల శాతాన్ని మరింత పెంచేలా ప్రత్యేక దృష్టి సారించాలని ఎంపీడీవో శ్రీహరిరెడ్డి అన్నారు. కోవూరులోని మండల పరిషత్ కార్యాలయంలో గురువారం డ్వామా ఏపీవో , ఫీల్డ్ అసిస్టెంట్లతో ప్రత్యేక సమీక్ష నిర్వహించారు. మాట్లాడుతూ ప్రస్తుతం మండలంలో జరుగుతున్న కాలువ పనులను మరింత వేగవంతం చేయడమే కాకుండా ప్రభుత్వం నిర్దేశించిన నియమ నిబంధనలకు లోబడి పనులు సాగాలన్నారు. గృహ నిర్మాణ పథకం కింద ప్రస్తుతం ఇళ్ల నిర్మాణం చేస్తున్న లబ్ధిదారులకు 90 రోజుల పనిదినాలను కూలీలకు కల్పించేలా తగు చొరవ తీసుకోవాలన్నారు. ఫీల్డ్ అసిస్టెంట్ల వారీగా పనితీరుపై సమీక్షించారు. ఈ సమీక్షలో డ్వామా ఏపీవో సుబ్బారావు,ఫీల్డ్ అసిస్టెంట్లు ఉన్నారు.

## గీతాంజలిలో పూర్వ విద్యార్థుల సమ్మేళనం



**కోవూరు జనవరి 16 ప్రభాతవార్త :** కోవూరు మండలం గంగవరం గ్రామంలోని గీతాంజలి ఇంజనీరింగ్ కళాశాలలో గురువారం పూర్వ విద్యార్థుల సమ్మేళనం కార్యక్రమం కోలాహలంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల కరస్పాండెంట్ ఎన్. సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ తమ కళాశాలలో చదివిన పూర్వ విద్యార్థులు ప్రస్తుతం యూరప్, అమెరికా, జర్మనీలలో ఉన్నత స్థానాల్లో స్థిరపడి ఈ సమావేశానికి హాజరు కావడం తమకెంతో గర్వకారణంగా ఉందన్నారు. కళాశాల పూర్వ విద్యార్థులు ఇటువంటి వాతావరణంలో కళాశాలతో తమకున్న అనుబంధాన్ని తెలియజేయడం తమకెంతో ఆనందాన్ని కలిగించిందన్నారు. పూర్వ విద్యార్థులు తమ అనుభవాలను అభిప్రాయాలను జ్ఞాపకాలను తమ జూనియర్లతో పంచుకుని వారికి తగు మార్గనిర్దేశం చేయాలని ఈ సందర్భంగా ఆయన సూచించారు. కళాశాల డైరెక్టర్ డాక్టర్ జి. సుబ్బారావు మాట్లాడుతూ పూర్వ విద్యార్థులు తాము సాధించిన విజయాలను వృత్తి జీవితంలో తాము ఎదుర్కొంటున్న సవాళ్లను జూనియర్లకు వివరించి వారు విజయం సాధించే దిశగా సహకారం అందించాలని ఈ సందర్భంగా సూచించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ సందీప్‌కుమార్ మాట్లాడుతూ తమ కళాశాల పూర్వ విద్యార్థులు తమ ప్రతిభా నైపుణ్యాలతో కళాశాల అధ్యాపకులు అందించిన మార్గదర్శకంలో ఉత్తమ ఇంజనీర్లుగా విజయవంతం అయిన వ్యవస్థాపకులుగా ఎదిగి జీవితంలో ఉన్నత శిఖరాలు అధిరోహించడం తమకెంతో ఆనందంగా ఉందన్నారు. ఈ సందర్భంగా వారు కేక్ కట్ చేసి తమ అనుభవాలను జూనియర్లతో పంచుకున్నారు. వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రావణ్ కుమార్, అడ్మిషన్ డీన్ డాక్టర్ కుమార్, ప్లేస్‌మెంట్ అధికారి వై. దినకర్, విభాగాధిపతులు డాక్టర్ టి. రవికుమార్, కోఆర్డినేటర్లు వై. మురళీకృష్ణ, షేక్ హబీబ్‌బాషా, సురేష్, శివనాగమణి, వసుంధర, సుకుమార్ , అధ్యాపకులు ఉన్నారు.

## ఏకాగ్రతతో ఆర్‌టిసి బస్సులు నడపండి : డీఎస్పీ శ్రీధర్



**కావలి, జనవరి16 ప్రభాతవార్త** ఏకాగ్రతతో మనసుపెట్టి ఆర్‌టిసి బస్సులు నడిపితే ప్రమాదాలను నివారించవచ్చునని కావలి డీఎస్పీ పి.శ్రీధర్ తెలిపారు. కావలి ఆర్‌టిసి డిపో గ్యారేజ్ ఆవరణంలో రోడ్డు భద్రత మాసోత్సవాలను గురు వారం ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో కావలి డీఎస్పీ శ్రీధర్, 1వ పట్టణ సి.ఐ ఫిరోజ్ ముఖ్య అతిధులుగా పాల్గొన్నారు. అనంతరం డీఎస్పీ మాట్లాడారు. ఇంటి సమస్యలను ఇంట్లోనే వదిలేయాలన్నారు. స్టీరింగ్‌పై శ్రద్ధ చూపాలన్నారు. సురక్షిత డ్రైవింగ్ విధానం పాటించకపోతే ప్రయాణీకుల కుటుంబాలతో సహా డ్రైవర్ కుటుంబంకూడా సమస్యలకు, బాధలకు గురవుతారన్నారు. అంతేకాకుండా ఆర్‌టిసి సంస్థ ప్రతిష్ఠ మసకబారుతుందన్నారు. కావలి డిపోమేనేజర్ రాపూరు శ్రీనివాసులు మాట్లాడుతూ రోడ్డు భద్రత మాసోత్సవాలను పురస్కరించుకుని నెలరోజులపాటు వివిధ కార్యక్రమాలద్వారా డ్రైవర్లకు అవగాహన కల్పిస్తామన్నారు. రోడ్డు ప్రమాదం నివారించడంలో బస్సుడ్రైవర్‌తోపాటు కండక్టర్‌కూడా బాధ్యత ఉంటుందన్నారు. బస్సుకండీషన్ నిర్వహణలో మెకానిక్‌ల పాత్రకూడా కీలకమన్నారు. అందులో వారికికూడా అవగాహన సదస్సులు, డ్రైవర్లకు వైద్యపరీక్షలు నిర్వహిస్తామన్నారు. ట్రాఫిక్ అసిస్టెంట్ మేనేజర్ కల్పనరెడ్డి సభను నిర్వహించడంతోపాటు సిబ్బంది, అధికారులతో భద్రతాప్రతిజ్ఞను చేయించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ ఇంజనీర్ (మెకానికల్) ఎస్‌కె ఖాదర్ మొహిద్దీన్, కావలి వన్‌టౌన్ ఎస్ఐలు జానకిరామిరెడ్డి, జమాల్, ట్రాఫిక్ సూపర్‌వైజర్ ఎం.రామకృష్ణ, మెకానికల్ సూపర్‌వైజర్ శీనయ్య, మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ దాకారపు రవిప్రకాష్, ఉద్యోగసంఘ నాయకులు, సిబ్బంది పాల్గొన్నారు.

## టిడిపి శాశ్విత సభ్యత్వాన్ని తీసుకున్న సింగమనేని



**కావలి, జనవరి16 ప్రభాతవార్త** కావలి పట్టణ ముసునూరుకు చెందిన తెలుగుదేశం పార్టీ నాయకులు సింగమనేని శేషగిరి టిడిపి పార్టీ శాశ్విత సభ్యత్వాన్ని తీసుకున్నారు. గురువారం లక్షరూపాయలు చెల్లించి సభ్యత్వం తీసుకున్నారు. కావలి ముసునూరులోని ఎమ్మెల్యే నివాసంలో ఎమ్మెల్యే దగుమాటి వెంకటకృష్ణారెడ్డి చేతులమీదుగా సభ్యత్వ కార్డును శేషగిరి అందుకున్నారు. శాశ్విత సభ్యత్వం తీసుకున్న శేషగిరిని ఎమ్మెల్యే దగుమాటి ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో టిడిపి లీగల్‌సెల్ కావలి నియోజకవర్గ కన్వీనర్ గుంటుపల్లి రాజ్‌కుమార్ చౌదరి, టిడిపి నేతలు పాల్గొన్నారు.

## కావలి ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలి



**కావలిరూరల్, జనవరి16 ప్రభాతవార్త** నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని కావలి నియోజకవర్గ ప్రజలందరూ అష్టఐశ్వర్యాలు, ఆయు రారోగ్యాలు, సుఖసంతోషాలతో ఉండాలని రామిశెట్టి వెంకటసుబ్బారావు చారిటబుల్ ట్రస్ట్ ఛైర్మన్ రామిశెట్టి వెంకటసుబ్బారావు కోరారు. సంక్రాంతి సందర్భంగా కావలి గ్రామదేవత శ్రీకళుగళశాంభవి అమ్మవారి సంక్రాంతి ఉత్సవాల సందర్భంగా స్నేహయూత్‌వారి పిలుపుమేరకు రామిశెట్టివెంకటసుబ్బారావు బుధవారం రాత్రి ముఖ్య అతిధిగా హాజరయ్యారు. ముందుగా కళుగోళశాంభవి అమ్మవారిని దర్శించుకుని అమ్మవారికి ప్రత్యేకపూజలు నిర్వహించి అనంతరం స్నేహయూత్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన సాంస్కృతిక కార్యక్రమంలో ఆయన పాల్గొనడం జరిగింది. స్నేహయూత్‌వారు రామిశెట్టి వెంకటసుబ్బారావుకు పుష్పగుచ్ఛాన్ని అందచేసి దుశ్శాలువాతో ఘనంగా సత్కరించడం జరిగింది. అనంతరం రామిశెట్టి వెంకటసుబ్బారావు మాట్లాడారు. కళుగోళశాంభవి అమ్మవారి ఆశీశ్శులు కావలి ప్రజలపై మెండుగా ఉండాలన్నారు. స్నేహయూత్‌వారు ముమ్ముందు ఇంకా మరెన్నో మంచి కార్యక్రమాలు చేయాలని ఆకాక్షించారు. ఈ కార్యక్రమంలో స్నేహయూత్ కమిటి సభ్యులు, ట్రస్ట్‌సభ్యులు, రామిశెట్టి అభిమానులు పాల్గొన్నారు.

## అన్నారెడ్డిపాళెంలో పోలేరమ్మ తల్లి గ్రామోత్సవం



**సంగం జనవరి 16 ప్రభాతవార్త** సంగం మండలం అన్నారెడ్డిపాళెం గ్రామంలో పోలేరమ్మ తల్లి గ్రామోత్సవం కన్నులపండుగగా నిర్వ హిం చారు. అమ్మవారిని దర్శించుకునేందుకు ప్రజలు పెద్దఎత్తున తరలివచ్చారు. అమ్మవారిని గజమాలలతో అలంకరించారు. మేళతాళాలతో అమ్మవారి గ్రామోత్సవం కన్నుల పండుగగా జరిగింది. గ్రామపొలిమేర్లలలో వేపమండలు కట్టి, గ్రామంలో పసుపునీళ్ళు చల్లుతో తప్పెట్లు తాళాలతో అమ్మవారు గ్రామోత్సవంలో భక్తులకు దర్శనమిచ్చారు. మహిళలుపెద్దఎత్తున అమ్మవారికి నైవేద్యాలు సమర్పించి ప్రసాదాలు స్వీకరించారు. ఈకార్యమానికి నిర్వాహకులుగా గ్రామస్తులు వ్యవహారించారు.



## అన్నారెడ్డిపాళెంలో చోరీ



**సంగం జనవరి 16 ప్రభాతవార్త** సంగం మండలం అన్నారెడ్డిపాళెం గ్రామంలో తూర్పు వీధిలో మావిళ్ళ ప్రసాద్ అనే రైతు ఇంట్లో చోరి జరిగింది. మావిళ్ళ ప్రసాద్ గత రెండు సంవత్సరాల నుండి బుచ్చి రెడ్డిపాళెంలో కాపురముంటున్నాడు. ఆయనకు సొంత ఇల్లు, పొలం స్వగ్రామమైన అన్నారెడ్డిపాళెంలో ఉన్నాయి. ప్రతి రోజు ఆయన పొలానికి వచ్చి ఇల్లు చూసుకొని వెళుతుంటారు . అయితే ఆయ న ఇంట్లో కొంత ఇత్తడి సామాను వుంచి ఉన్నారు. రోడ్డులో ఉండే ఇల్లే కదా నిత్యం అందరు తిరుగుతుంటారని ఆ సామాను బుచ్చి లోని బాడుగు ఇంట్లోకి తీసుకొని వెళ్ళలేదు. ఇదే అదనుగా సంక్రాం తి రోజు రాత్రి ఇల్లు తలుపు తీసి సామాను అపహ కరిం చుకొని పోయారు. ఆయన కనుమపండుగ రోజు వచ్చి చూస్తే సామాను ఇంటి తలుపులు తీసి వున్నాయి. ఇంట్లో సామాను లేదు. ఆయన వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేయగా పోలీసులు ఇంటిని పరిశీలించి వెళ్లారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

## అయ్యప్పస్వామి దేవస్థానంలో మకరజ్యోతి వేడుకలు



**కావలి, జనవరి16 ప్రభాతవార్త** కావలి పట్టణం కళుగోళమ్మపేటలోని అయ్యప్పస్వామి దేవస్థానంలో మకరజ్యోతివేడుకలు అత్యంత ఘనంగా జరిగాయి. ఆలయం పడిపూజ ఎంతో వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయధర్మకర్తలు దుగ్గిశెట్టి మాధవి, దుగ్గిశెట్టి కీర్వాణి, దుగ్గిశెట్టి నవీన్-లక్ష్మి దంపతులు, డాక్టర్ జ్వాలా రామ్‌కుమార్-స్వరూప దంపతులు, ఆలయ కమిటి సభ్యులు భవనాసి కృష్ణస్వామి, అమరావేదగిరి సుబ్బరాయుడుగుప్తా, వేమా ప్రకాశం, కంచర్ల కళ్యాణ్ చక్రవర్తి, బొగ్గవరపు వెంకటేశ్వర్లు, దేవస్థానం అర్చకుడు మణిశర్మ, భక్తులు పాల్గొన్నారు.




## సచివాలయ ఉద్యోగుల క్యాలెండర్ ఆవిష్కరణ



**సైదాపురం, జనవరి 16, ప్రభాతవార్త** స్థానిక ప్రజాపరిషత్ కార్యాలయంలో ఆంధ్రప్రదేశ్ గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల సంక్షేమ సంఘం వారికి సంబంధించిన క్యాలెం డర్‌ను ఎంపీడీఓ పురుషోత్తం శివకుమార్ గురువారం ఆవిష్క రించారు. ఈ కార్యక్రమంలో ఈవోఆర్డీ పి.రాఘవేంద్ర, జిల్లా అధ్యక్షులు థామస్, జిల్లా ప్రధాన కార్యదర్శి అశోక్‌కుమార్, జనార్దన్‌రావు, అశోక్, జోష్ణ, మధుజ్యోతి, వెంకటేష్, సచివా లయ సిబ్బంది పాల్గొన్నారు.

## స్త్రీనిధి బకాయిలపై ప్రత్యేక దృష్టి సారించాలి



**కోవూరు జనవరి 16 ప్రభాతవార్త :** కోవూరు మండలంలోని అన్ని గ్రా మాలకు సంబంధించి పొదుపు గ్రూపుల్లో ఉన్న స్త్రీనిధి బకాయిలపై వీవో ఏలు ప్రత్యేక దృష్టి సారించి మార్చి 31 లోగా నూరుశాతం బకాయిలు పూర్తిచేసేలా ప్రత్యేక దృష్టి పెట్టాలని స్త్రీనిధి ఏజీఎం కామాక్షయ్య అన్నారు. కోవూరులోని సంఘమిత్ర కార్యాలయ సమావేశ మందిరంలో గురువారం వీవోఏలతో ప్రత్యేక సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కోవూరు మండలానికి సంబంధించి స్త్రీనిధి ద్వారా పొదుపు గ్రూపులకు రూ. 7 కోట్ల మేర రుణాలు ఇవ్వాలని లక్ష్యంగా నిర్ణయించడం జరిగిందన్నారు. ఇప్పటి వరకు 5 కోట్ల మేర రుణాలు అందించడం జరిగిందని, మిగిలిన 2 కోట్లు కూడా ఈ నెలాఖరులోగా పూర్తి చేసేలా వీవోఏలు తగు చొరవ తీసుకోవాలన్నారు. రుణాలు తీసుకున్న పొదుపు గ్రూపులు ఆర్థికాభివృద్ధిని ఘననీయంగా పెంచుకునే లా సంబంధిత గ్రామాల వీవోఏలు ప్రత్యేక దృష్టి పెట్టాల్సిన అవసరం ఉందన్నారు. ఈ సమీక్షలో ఏపీఎం సుబ్బరాజు, స్త్రీనిధి మేనేజర్ మేరీ, సీసీలు చైతన్యబాబు, రాజశేఖర్, శోభ, రాము, తదితరులు ఉన్నారు.

## ఉదయగిరి కార్యకర్తలకు మేకపాటి భరోసా



**ఉదయగిరి, జనవరి 16, ప్రభాతవార్త** గండిపాలెంలో ఉదయగిరి వైసీపీ ఇన్‌ఛార్జ్ మేకపాటి రాజగోపాల్‌రెడ్డి ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ త్వరలోనే ఉదయగిరి వైసీపీ పార్టీ కార్యాలయం ప్రారంభిస్తామని నియోజకవర్గంలో కార్యకర్తలకు ఎటువంటి సమస్య ఉనన్న తాను ముందుండి పోరాడుతానని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నాయకులు రాపల్లి తిరుపతి, షేక్ రియాజ్, రాపల్లి శ్రీను, అబ్దుల్ రజాక్ సద్దాం, నియోజకవర్గ మొత్తం జడ్పీటీసీలు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, వైసీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

## సాయినాధుని సన్నిధిలో మాదాసు



**కలువాయి జనవరి16 ప్రభాతవార్త** మండలకేంద్రమైన కలువాయిలోని శ్రీ షిర్డి సాయి బాబా మందిరంలో గురువారం మాజీ ఎంఎల్‌సి మాదాసు గంగాధరం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు గోత్రమాలతో పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం మాదాసు గంగాధరంకు తీర్థ ప్రసాదాలను అందజేశారు. కలువాయి గ్రామానికి వచ్చిన మాదాసును ఆయన అభిమానులు కలిసి ఘనంగా సత్కరించారు. అనంతరం పెన్నబద్వేల్ కొండపైన వెలసి ఉన్న భగవాన్ వెంకయ్యస్వామి, శ్రీరామమందిరం శివాలయాల నందు ఆయన ప్రత్యేకంగా పూజలు నిర్వహించారు.

## పతకాలు సాధించిన ఆర్చరీ క్రీడాకారులకు అభినందన



**నెల్లూరు,జనవరి16 ప్రభాతవార్త-విద్య** నెల్లూరుజిల్లా ఆర్చరీ అసోసియేషన్ అధ్వర్యంలో నగరంలోని స్థానిక ఆదిత్యానగర్‌లోని ఎస్పీబాల సుబ్రహ్మణ్యం పార్క్‌లో రాష్ట్రస్థాయి ఆర్చరీ పోటీల్లో విజేతలుగా నిలిచి మూడు పతకాలు సాధించి జాతీయస్థాయి పోటీలకు ఎంపికైన వారికి అభినందన కార్యక్రమాన్ని నిర్వహించారు. రికర్వ్ రౌండ్‌లో ఆర్.సాయి మౌర్య బంగారు పతకం, కె.తరుణీష్‌జ్యోత్స సిల్వర్, సిహెచ్.అక్షయ్ మహాదేవ్‌లు బ్రాంజ్ పతకాలు సాధించారు. అలాగే 31వ ఎన్‌టిపిసి సీనియర్‌బాలుర ఆర్చరీ ఛాంపియన్‌షిప్ రాష్ట్రస్థాయి పోటీల్లో ఇండియన్ రౌండ్‌లో జి.వెంకట లోకేష్ బంగారు పతకం, ఎ.సాత్విక్ బ్రాంజ్ పతకాలు సాధించి జాతీయ పోటీలకుఎంపికైయ్యారు. 41వ సబ్‌జూనియర్ ఆర్చరీ ఛాంపియన్‌షిప్‌రాష్ట్ర పోటీల్లో రికర్వ్‌రౌండ్‌లో తరుణీష్ జ్యోత్స, సాయి మౌర్య, అక్షయ్‌మహాదేవ్,పి.రాజేష్, లతోపాటూ ఇండియన్ రౌండ్‌లో జి.వెంకట లోకేష్, ఎ.సాత్విక్, ఎ.లాస్యలు 7 పతకాలు సాధించిన జాతీయపోటీలకు ఎంపికైయ్యారు. 41వ ఎన్‌టిపిసి సబ్‌జూనియర్ ఆర్చరీ రాష్ట్రస్థాయి పోటీల్లో విక్సిడ్ విభాగంలో ఆర్.సాయి మౌర్య, 44వ ఎన్‌టిపిసి సీనియర్‌బాలుర రికర్వ్‌రౌండ్‌లో గురులు జాతీయస్థాయి పోటీలకు ఎంపకైయ్యారు. అలాగే తరుణీష్ జ్యోత్న , సాత్విక్, భరద్వాజరెడ్డి,శివశంకర్, దివి ప్రకాష్, శివశంకర్, హారతి, సాయి కిరణ్, జయశంకర్‌దివి ప్రకాష్ ఉత్తమ ప్రతిభ కనపరిచారు. ఈ క్రీడాకారులకు జిల్లా ఆర్చరీ అసోసియేషన్ ఆధ్వర్యంలో శాలువాలు కప్పి పుష్పగుచ్ఛాలతో ఘనంగా సత్కరించారు. జిల్లా క్రీడాశాఖ అధికారి ఆర్‌కే.యతిరాజ్, పసుపులేటి రామమూర్తి, అసోసియేషన్ అధ్యక్ష్య కార్యదర్శులు పల్లంరెడ్డి శ్రీహర్ష, పావురాల వేణు, ఒలింపిక్ అసోసియేషన్ అధ్యక్ష్య కార్యదర్శులు ఆనం మహేశ్వర్‌రెడ్డి,గురు ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రమాదాల నివారణకు రోడ్డునియమాలు తప్పనిసరిగా పాటించాలి



**నెల్లూరు,జనవరి16 ప్రభాతవార్త-విద్య** ప్రమాదాల నివారణకు రోడ్డు నియమాలు తప్పని సరిగా పాటించాలని ఎంవిఐ పూర్ణచంద్రరావు పేర్కొన్నారు. గురువారం నగరంలోని స్థానిక ఆర్టీసీ 1 డిపోలో మేనేజర్ మురళీకృష్ణ అధ్యక్ష్యతన నిర్వహించిన రోడ్డు బధ్రతా మాసోత్సవాల ప్రారంబోత్సవంలో ఆయన ముఖ్య అతిధిగా పాల్గొని మాట్లాడారు. ప్రతి ఒక్కరూ రోడ్డు నియమాలను పాటించటంతోపాటూ వారి వారి వాహనాలను క్రమం తప్పకుండా సర్వీసులు చేయిం చాలన్నారు. అప్పుడే ప్రమాదాల నివారణ సాధ్య మౌతుందని తెలిపారు. మద్యం సేవించి వాహనాలను ఎట్టి పరిస్తితుల్లో నడుపరాదన్నారు. అనంతరం ఆర్టీసీ డైవర్లు సిబ్బందికి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ సిబ్బంది, గ్యారేజ్ సిబ్బంది, కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## బాలికలను చదివిద్దాం... రక్షిద్దాం...



**కావలి, జనవరి16 ప్రభాతవార్త** సమా జంలో బాలికలను చదివించి రక్షించాలని కావలి ఎక్సైజ్ ప్రొహిబిషన్ సర్కిల్ ఇన్స్‌పెక్టర్ శ్రీనివాసులు పిలుపునిచ్చారు. కావలి పట్టణంలోని శాంతినగర్‌లో ఉన్న జెమ్స్ బాలికలహోమ్‌లో యారం ప్రశాంతి పుట్టిన రోజు సందర్భంగా చిన్నారులకు బియ్యం, నిత్యావసర వస్తువులను గురువారం అందచేశారు. ఈ సందర్భంగా సిఐ శ్రీని వాసులు మాట్లాడారు. బాలికలను చదివించి ఉన్నత విద్యను అభ్యసించేందుకు ప్రతి ఒక్కరూ కృషిచేసి బాలికావిద్యను ప్రోత్సహించాలన్నారు. లోక్‌అదాలత్ సభ్యుడు ఎం.మాలకొండారెడ్డి మాట్లాడుతూ బాలికల రక్షణకోసం ఏర్పాటుచేసిన హెల్ప్‌లైన్ 1098, 181 ద్వారా రక్షణకూడా పొందవచ్చునన్నారు. ఈ కార్యక్రమంలో ఎక్సైజ్ ఎస్ఐ దేవిక, నోటి ప్రసాదరెడ్డి, జెమ్స్‌బాలికలహోమ్ నిర్వాహకులు మార్క్, చిన్నారులు పాల్గొన్నారు.

## మెడికవర్‌లో ఉచితంగా క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు

◆రూ.5వేలు ఖరీదైన పరీక్షలు ఉచితం

◆గోడపత్రికను ఆవిష్కరించిన ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి



**నెల్లూరు, జనవరి 16, ప్రభాతవార్త-వైద్యం** నగరంలోని మెడికవర్ క్యాన్సర్ ఇనిస్టిట్యూట్‌లో మహిళలకు ఉచితంగా గర్భాశయ ముఖ ద్వారపు క్యాన్సర్ పరీక్షలను ఉచితంగా నిర్వహిస్తున్నట్లు క్యాన్సర్ ఇనిస్టిట్యూట్ సెంటర్ హెడ్ డాక్టర్ బింధు భార్గవిరెడ్డి వెల్లడించారు. అందులో భాగంగా ఈ మాసాన్ని సర్వైకల్ క్యాన్సర్ అవగాహన నెలగా పాటిస్తూ ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఆమె పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా మహిళలకు ఈనెల 31వ తేదీ వరకు రూ.5100లు విలువైన సర్వైకల్ క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలను ఉచితంగా నిర్వహిస్తున్నట్లు తెలియజేశారు. దీనికి సంబంధించిన గోడ పత్రికను నగరంలోని మాగుంట లేఅవుట్‌లో ఉన్న కోవూరు శాసనసభ్యురాలు వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి వారి నివాసంలో ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి మెడికవర్ హాస్పిటల్ బృందాన్ని అభినం దించారు. మంచి కార్యక్రమం చేపట్టారంటూ కొనియాడారు. అనంతరం డాక్టర్ బింధురెడ్డి మీడియాతో మాట్లాడుతూ 25 ఏళ్ల వయసు నుండి 65 ఏళ్ల మహిళలకు గర్భాశయం ముఖ ద్వారపు క్యాన్సర్(సర్వైకల్ క్యాన్సర్) వచ్చే అవకాశం ఉందన్నారు. దుర్వాసనతో కూడిన వైట్ డిశ్చార్జ్ అవుతున్నా, క్రమం లేకుండా రుతు క్రమం అవుతున్నా అది సర్వైకల్ క్యాన్సర్ లక్షణంగా పరిగణించి వెంటనే వైద్యులను సంప్రదించి స్క్రీనింగ్ పరీక్షలు చేయించుకుంటే చికిత్స ద్వారా నివారణ సాధ్యమని డాక్టర్ బింధురెడ్డి వెల్లడించారు. సర్వైకల్ క్యాన్సర్ రాకుండా టీకా కూడా అందుబాటులో ఉందని చెప్పారు. ముఖ్యంగా సర్వైకల్ క్యాన్సర్‌పై మహిళలు అవగాహన పెంచుకోవాలని పేర్కొన్నారు. నెల్లూరు మెడికవర్ క్యాన్సర్ ఇనిస్టిట్యూట్‌లో ఈనెల 31వరకు మహిళలకు ఉచితంగా సర్వైకల్ క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహిస్తున్నామని, ఈ అవకాశాన్ని మహిళలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. తమ వద్ద అన్ని రకాల క్యాన్సర్ల చికిత్సకు అవసరమైన అధునాతన వైద్య పరికరాలు, అనుభవజ్ఞులైన వైద్యులు అందుబాటులో ఉన్నారని డాక్టర్ బింధురెడ్డి పేర్కొన్నారు. ఈ పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమంలో మెడికవర్ హాస్పిటల్స్ మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ యశ్వంత్‌రెడ్డి, మార్కెటింగ్ మేనేజర్ సతీష్‌బాబు, పీఆర్వో చందువర్మ, ఎమ్మెల్యేప్రశాంతిరెడ్డి తనయుడు డాక్టర్ సోమిరెడ్డి అర్జున్‌రెడ్డి, టీడీపీనేత రవీంద్రరెడ్డి పాల్గొన్నారు.